ఆఖరి మజిలీకీ అవస్థలే..

- కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికలకు స్థలాలే లేవు
- మరికొన్నిచోట్ల వెళ్లేందుకు దారి సౌకర్యం అధ్వానం
- అభివృద్ధికి నోచుకోక మరికొన్ని శ్మశానవాటికలు
- ఇంకెన్నాళ్లు బాధలు పడాలని దళితుల ఆవేదన

బుట్టాయగూడెం: మనిషి బ్రతికినంత కాలం బాధలు, కష్టాలతో జీవిస్తుంటాడు. కనీసం చనిపోయిన తర్వాతైనా ఆ జీవిని ఖననం చేసేందుకు సరైన ప్రదేశం లేని దుస్థితి. ఏళ్లు గడుస్తున్నా.. పాలకులు మారుతున్నా తమ బాధలు మాత్రం తీరవడం లేదని దళితులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలోని కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికలు లేవు. దీంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్నిచోట్ల శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. వాగులు, కాలువలు దాటి కర్మలు చేయడానికి వెళ్లాల్సిన దుస్థితి. మరికొన్నిచోట్ల శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోక తుప్పలు, చెట్లు పెరిగిపోయాయి. అంత్యక్రియల కోసం తాము పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ పోలవరం నియోజకవర్గంలో నివసిస్తున్న దళితులు, దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉపాధి హామీ పథకం ద్వారానైనా శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

- జీలుగుమిల్లిలో ఆదివారం ములగిరి రత్తమ్మ ఎస్సీ కాలనీకి చెందిన మహిళ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు దళితులు నానా అవస్థలు పడాల్సివచ్చింది. శ్మశానానికి మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి సరైన మార్గం లేక మోకాళ్ల లోతు నీళ్లల్లో నడుచుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.
- బుట్టాయగూడెం మండలంలోని రామన్నగూడెం, అచ్చియ్యపాలెం గ్రామాల్లో చెరువు పోరంబోకు భూముల్లో చాలీచాలని స్థలంలో అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి.
- బుట్టాయగూడెం మండలంలోని శ్రీరామపురంలో బుట్టాయగూడెం, రామారావు సెంటర్ తదితర గ్రామాల్లో దళితులకు కేటాయించిన శ్మశానవాటికల్లో సరైన సదుపాయాలు లేవు.


జీలుగుమిల్లిలో మోకాలిలోతు నీళ్లలో మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్తున్న దృశ్యం

సరైన దారి లేదు


దళితుల శ్మశానవాటికల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి. జీలుగుమిల్లి శ్మశానవాటికకు వెళ్లే మార్గం అస్తవ్యస్తంగా ఉంది. అభివృద్ధికి నిధులు కేటాయించాలి. సరైన మార్గం ఏర్పాటు చేయాలి.

– పొనుగుమాటి సాయిబాబు, జీలుగుమిల్లి

సమస్యలు పరిష్కరించాలి


దళితుల శ్మశానవాటికల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. జీవో నంబర్ 12 అమలు చేయాలి. ఉపాధి హామీ పథకంలో శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేయించాలి.

– అందుగుల ఫ్రాన్సిస్, కేవీపీఎ జిల్లా నాయకులు, బుట్టాయగూడెం

పిచ్చిమొక్కలతో అధ్వానంగా..


మాకు శ్మశానవాటిక ఉన్నా అక్కడికి వెళ్లాలంటే సరైన మార్గం లేదు. వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నాం. శ్మశానవాటిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. దాని చుట్టూ కంచే ఏర్పాటుకు, మొక్కలు తొలగించేందుకు అధికారులు ఉపాధి హామీ పథకంలో నిధులు కేటాయించాలి.

– బొంతు వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి గ్రామ పెద్ద

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణతో పూజలు అందుకున్న శ్రీవిజయ కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: నరసన్నపాలెం వైజంక్షన్‌లోని శ్రీవిజయ కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు సామూహిక పూజలు, అర్చనాది అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో యువతులు పాల్గొనగా శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి అర్చకులు వేదపండితులు లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో పసుపు కొమ్ములతో అభిషేకించి, అమ్మవారికి వాలుజడను అలంకరింపచేసి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ పాలక కమిటీ ఏర్పాటు చేసింది.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్న జంగారెడ్డిగూడెం కుంగ్‌ఫూ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన కుంగ్‌ఫూ విద్యార్థులు ప్రతిభ చాటారు. విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో 15 మంది పాల్గొన్నట్లు కోచ్ తెలిపారు. ఆయా కేటగిరీల్లో ఆరుగురు ప్రథమ స్థానం, ఐదుగురు ద్వితీయ, ఒకరు తృతీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను పట్టణ ప్రముఖులు, తల్లిదండ్రులు అభినందించారు.

వరద బాధితులకు సహాయం


పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితులకు సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితులకు ఆదివారం సహాయం అందించినట్లు జంగారెడ్డిగూడెం న్యాయవాది యు.ఏసుబాబు తెలిపారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం సంస్థ, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి వరద బాధితులకు దుస్తులు, స్టీల్ వంట పాత్రలు, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో కొలనువాడ పెద్ద కృష్ణంరాజు, గ్రంధి సత్యనారాయణ, బుద్దాల రామారావు, వెజ్జు దుర్గాప్రసాద్, ఉద్దండం ఏసుబాబు, తాడేపల్లిగూడెం ఎన్‌ఐటీ, శశి, వాసవీ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో డిప్యూటీ తహసీల్దార్ మృతి


మహమ్మద్ మొహిద్దీన్ (ఫైల్)

కామవరపుకోట: కామవరపుకోట సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ మొహిద్దీన్ (58) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఏలూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ ఎలీసా, రెవెన్యూ సిబ్బంది పలువురు సంతాపం తెలియజేశారు.

విజిలెన్స్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆదివారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న చావా రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.4,680 విలువైన 117 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు.

జూదరుల అరెస్ట్


పేకాట స్థావరం వద్ద అరెస్ట్ చేసిన వ్యక్తులతో ఎస్సై జయబాబు, పోలీస్ సిబ్బంది

కామవరపుకోట: మండలంలో పేకాట స్థావరంపై దాడి పోలీసులు దాడి చేశారు. వడ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్సై జయబాబు తన సిబ్బందితో దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,950 నగదు, ఏడు మోటర్‌సైకిళ్లు సీజ్ చేసినట్లు చెప్పారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

అధికారం కోసమే చంద్రబాబు హామీలు

బుట్టాయగూడెం: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత, వెట్టి భారతి డిమాండ్ చేశారు. మండలంలోని దొరమామిడిలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు అధికారం కోసమే హామీలు ఇచ్చారే తప్ప మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం పాలసీ వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా ఎంచుకోవడం సిగ్గు చేటని అన్నారు.


దొరమామిడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భారతి

మద్యాన్ని నిషేధించి ప్రజలకు ప్రాణరక్షణ కల్పించాలని అన్నారు. లేనిపక్షంలో మహిళా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఇందుకోసం అక్టోబర్ నెలలో జిల్లా మహాసభలు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఈమని మల్లిక, కారం అరుణ, ధర్మల లక్ష్మి, తగరం సత్యవతి, సరియం అనిత, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన సీఐ

జంగారెడ్డిగూడెం: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యనైనా ఉపేక్షించేది లేదని సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు రౌడీ షీటర్లకు వారి ప్రవర్తన, నడవడికలపై కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని, అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకూడదన్నారు. ఎక్కడైనా, ఎవ్వరైనా ప్రజాశాంతికి భంగం కలిగించి ఏదైనా సమస్యలు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి గొడవలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించకుండా మంచి జీవితాన్ని గడపాలన్నారు. తాము ఇప్పటికే తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, భవిష్యత్తులో ఎలాంటి తప్పులు చేయమని రౌడీ షీటర్లు పోలీసు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జ్యోతిబాస్, సిబ్బంది పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పి.రాజేష్

ఈవ్ టీజింగ్ నుంచి కాపాడండి

ప్రభుత్వ కళాశాల హాస్టల్స్ విద్యార్థినుల వేడుకోలు

కొయ్యలగూడెం: ఈవ్ టీజింగ్ నుంచి తమల్ని కాపాడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వద్ద ప్రభుత్వ ఎస్టీ కళాశాల హాస్టల్స్ విద్యార్థులు మొర పెట్టుకున్నారు. పరింపూడిలోని బాలికల ఎస్టీ హాస్టల్‌ను ఆయన ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు తగినంతమంది హాస్టల్లో లేకపోవడం గురించి సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల యువతులు, హైస్కూల్ విద్యార్థినులు తమ సమస్యలను ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో హాస్టల్ గేట్ల ముందు జులాయిల ప్రవర్తనలతో విసుగు చెందుతున్నామని కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు చెబితే చదువు మానిపించేస్తారేమోనని భయంతో మిన్నకుండిపోతున్నామని ఎమ్మెల్యే వద్ద పేర్కొన్నారు. అదేవిధంగా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని, హాస్టల్లో ఫ్యాన్ల సౌకర్యం పూర్తిస్థాయిలో లేదని వాపోయారు. విద్యార్థినుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


పరింపూడి హాస్టల్లో ఎమ్మెల్యే బాలరాజుకి సమస్యలు తెలియజేస్తున్న విద్యార్థులు

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయండి

చింతలపూడి: సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సంపదను దేశంలోని కష్ట జీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం జాతీయ సమ్మేళనాల్లో కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు. ఈ జాతీయ సమ్మేళనాలకు దేశ వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సెప్టెంబర్ 3 వ తేదీన వేలాది మందితో ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనకు అన్ని రంగాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె విఘ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెలగాడు అనురాధ, రాము, వడిత్య బాలు, బొత్స రాజేష్, శ్రీరాముల పార్వతి తదితరులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రహదారి మరమ్మతులకు గ్రామస్తుల శ్రమదానం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరు, గోగుమిల్లి రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. గతంలో ఈ రహదారికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తారురోడ్డు వేయడం జరిగింది. తదుపరి ఈ రహదారి కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పులిరామన్నగూడెం నుంచి రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్ల వరకూ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శంకుస్థాపన కూడా చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు నిలిచాయి. ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా ఉంది. ప్రతి బుధవారం కన్నాపురం సంతకు, ఇతర పనుల నిమిత్తం గడ్డపల్లి, గిన్నేపల్లి, ముంజులూరు, దారావాడ గ్రామాల నుంచి గిరిజనులు వస్తూ ఉంటారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులే శ్రమదానం చేసి ఆ రోడ్డులోని గోతుల్లో మట్టిని వేసి మరమ్మతు పనులు చేసుకుంటున్నారు. గతంలో మంజూరైన నిధులతో ఈ రహదారిని నిర్మించేందుకు అధికారులు కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


ముంజులూరు రహదారి మరమ్మతులకు గ్రామస్తులు శ్రమదానం చేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేస్తుండడం అభినందనీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–83 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.60 వేల వ్యయంతో సరస్వతీ అమ్మవారి విగ్రహం, జాతీయ చిహ్నమైన నాలుగు సింహాల స్థూపాన్ని ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను రాంబాబు అభినందించారు. జూనియర్ కళాశాలను ఆనుకుని ఉన్న స్థలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులు ఆయన్ను ఈ సందర్భంగా కోరారు. పూర్వ విద్యార్థులు విశ్వనాథ శర్మ, టీవీఎస్ దీక్షితులు, దొమ్మేటి సత్యనారాయణ, కానూరి శ్రీను, చవ్వా సూరిబాబు, సుబ్బారాయుడు, ఎండీ వలి, రాధిక, టీవీఎస్ సువర్చల, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సరస్వతీ అమ్మవారి విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులతో కరాటం రాంబాబు

15న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలోని విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వైఎంహెచ్‌ఏ హాలు కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90323 23632, 94930 59598 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఎంపీని సన్మానించిన వర్జీనియా రైతులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను వర్జీనియా రైతు సంఘాల నాయకులు ఆదివానం ఏలూరులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ అదనంగా పండిన పంటకు అపరాధ రుసుములేకుండా కొనుగోలు చేయాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. దీంతో రాజమండ్రి ఎంపీ పురందేశ్వరితో కలిసి ఇటీవల దేవరపల్లిలో జరిగిన వర్జీనియా రైతుల అవార్డు వేడుకల్లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రైతు సమస్యను తెలియజేసి అనుమతులు వచ్చేలా కృషిచేశారన్నారు. దీంతో అదనంగా పండిన పంటను ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అమ్ముకోగలిగామని రైతు సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘాల నాయకులు పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, కాకర్ల నంది, ఇల్లూరి రాంబాబు, శ్రీనివాసరావు, కరాటం రెడ్డినాయుడు, వామిశెట్టి హరిబాబు, కూచిపూడి రమేష్, వీవీఎస్ ప్రకాశరావు, ఆట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, బిక్కిన వెంకటేశ్వరరావు, సింహాద్రి శ్రీను, కాకర్ల శేషు, గద్దే శ్రీధర్ తదితరులు ఉన్నారు.


ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను సన్మానిస్తున్న వర్జీనియా రైతులు

శ్రీకృష్ణ జన్మాష్టమిపై ప్రచారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ సమాజంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఊరేగింపు విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక తంగెళ్ళమూడిలోని యాదవ నగర్‌లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో తాడేపల్లిగూడెం కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ రూపంలో జన్మించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు అని, ఆయన గురించి సమాజానికి తెలియజేయడానికే ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పూర్వం శ్రీ కృష్ణ జన్మాష్టమికి 11 రోజుల పాటు ఊరేగింపు నిర్వహించేవారని, చివరి రోజున చవితి నాడు ఊరేగింపు ముగించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలి


బైనేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పేరంపేట శివారులో బైనేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటూ రైతులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా వాగులో ఇసుకను ట్రాక్టర్లపై తరలించి దళారులు విక్రయాలు చేస్తున్నారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తవ్వకాలతో వాగు గోతులమయంగా మారుతోందని, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. రైతుల పొలాలకు వెళ్లే రహదారులపై నిత్యం ఇసుక ట్రాక్టర్లతో రాకపోకలతో సాగించడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని పేరంపేట, పంగిడిగూడెం, వెంకట రామానుజపురం రైతులు వేడుకొంటున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వినతి

కొయ్యలగూడెం: కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. కొయ్యలగూడెం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆయన్ను కాంట్రాక్ట్ అధ్యాపకులు కలుసుకొని తమ సమస్య గురించి వివరించారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 40 మంది వరకు పోలవరం నియోజకవర్గంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేస్తూ ఉన్నామన్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమతో సహా రాష్ట్రంలో ఉన్న 3600 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. డి.జ్యోతిర్మయి, పి.విక్రమ్, ఎం.సుజాత, ఎ.హిమబిందు, ఏపీ వీరభద్రం, పి.అనంతలక్ష్మి, కె.రాధాకృష్ణ, కె.నాగేశ్వరరావు, ఎం.సోమరాజు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో గ్రామంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కలపర్తి విజయ్, రెళ్ల మోషే, గుండె ప్రవీణ్‌కుమార్, రవి, గాంధీ, వీర్రాజు, సురేష్, మోషే పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పారేపల్లి వీర వెంకట సత్యనారాయణ కోరారు. ఆదివారం లక్కవరంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిపై జెండా ఎగుర వేయడం, తల్లికి వందనం కార్యక్రమాలు, స్వచ్ఛభారత్, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొండపల్లి కేశుబాబు, విజ్జు కృష్ణమూర్తి, ఒంటెద్దు ఏసు వరప్రసాద్, బాల వర్ధిరాజు, తుమ్మలపల్లి బ్రహ్మాజీరావు, గణపవరపు రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని దళిత సేన ఏలూరు నగర కమిటీ సమావేశం జిల్లా దళిత సేన మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ లావేటి ప్రవళిక అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద బాధితులు చేసే ఫిర్యాదులపై విచారణ అనే పేరుతో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కేసుల విషయంలో బాధితులకు చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులను తక్షణమే చెల్లించేలా మార్గ నిర్దేశం చేయాలని కోరారు. సమావేశంలో ఏలూరు నగర దళిత సేన మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి మధులత, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.